# దక్షిణాపథ వార్తావని

జనవరి 2026

సంపుటి - 01
సంచిక - 03

సాంప్రదాయకంగా మన దేశంలో వింధ్యకు దక్షిణాన ఉన్న భూమి దక్షిణాపథంగా పరిగణించబడుతుంది. భారతీయ ఏకాత్మత స్ఫూర్తిగా సమాజాన్ని, మారుతున్న కాలాన్ని ప్రతిబింబిస్తూ గొప్ప రాజకీయ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, ప్రజలు, స్ఫూర్తిదాయక చిహ్నాలను సంగ్రహించడం, సమీకరించడం దక్షిణాపథం పేరిట నడిపే ఈ బులెటిన్ లక్ష్యం. రాష్ట్రాల పరంగా చూస్తే దక్షిణాపథం ప్రస్తుత ఆంధ్రప్రదేశ్, గోవా, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, పాండిచ్చేరి, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలను సూచిస్తుంది. ప్రస్తుతమున్న మధ్యప్రదేశ్, చత్తీస్ గఢ్ మరియు ఒడిషాలోని కొన్ని ప్రాంతాలు కూడా దక్షిణాపథం క్రిందికే వస్తాయి. ఈ ప్రాంతాల విషయాలు ఈ బులెటిన్ లో ప్రస్తావిస్తున్నాము.

## భారతీయ ఏకాత్మత -- శ్రీ వరిగొండ కాంతారావు గారి అతిథి లేఖనం సంక్షిప్తంగా:

భారతదేశం ఆధ్యాత్మిక, సాంస్కృతిక దృక్కోణంలో వేల సంవత్సరాలుగా ఒకటే దేశంగా భావించబడుతున్నది. ఉత్తరం--దక్షిణం, తూర్పు--పడమర వంటి భౌగోళిక విభేదాలు, మతపరమైన తేడాలు అన్నీ మానవ మదిలో ఉద్భవించిన భ్రమలు మాత్రమే.

సంకల్పాల్లో "జంబుద్వీపే భరతవర్షే" అని మనం చెప్పుకొనడం, పూజలలో గంగా, యమునా, గోదావరి, కావేరి వంటి నదులను ఒక్కటిగా స్మరించడం, భారతీయుడు ఎక్కడ నివసించినా భౌగోళికంగా ఒకటే మాతృభూమి పరిధిలో ఉన్నాడన్న ఆత్మబోధ భారతదేశ సహజ ఏకత్వానికి అద్దం పడుతుంది.

భారతీయ సంస్కృతిలో హిందూ మతం మతం కాదు. అది ఒక జీవన విధానం. శైవ, వైష్ణవ, శాక్త, సౌర, గణపత్య, స్కంద వంటి విభిన్న ఆరాధనా మార్గాలు ఉన్నప్పటికీ, వాటన్నింటి వెనుక ఉన్న పరమ సత్యం మాత్రం ఒక్కటే–పరమాత్మతో జీవాత్మ ఏకత్వం పొందడం. విరోధాలు, మత వాదాలు తరువాత కాలంలో పరమార్థాన్ని మరచి పుట్టినవి.

ఆధ్యాత్మిక దృష్టిలో మనిషి శరీరం పంచభూతాల సమాహారం. జీవాత్మ మరియు పరమాత్మ సంబంధాన్ని తెలుసుకోవడానికి జ్ఞానం, కర్మ మరియు భక్తి మార్గాలు అభివృద్ధి చెందాయి. ఒక్కో మతం ఈ మార్గంలో వేర్వేరు పద్ధతుల్ని సూచించినప్పటికీ, మార్గాలు వేరు అయినా లక్ష్యం మాత్రం ఒక్కటే.

క్రైస్తవం, ఇస్లాం వంటి అబ్రహమిక్ మతాలను పరిశీలించినప్పుడు, విగ్రహారాధన లేదనే వారి వాదం కేవలం ఊహ మాత్రమే. శిలువలు, కాబా, హజ్ యాత్ర, పవిత్ర జలాలు వంటి ఆచారాలు సనాతన ధర్మ ఆచారాలతో ఎంతో సమానంగా ఉన్నాయని, పేర్లలో మాత్రమే తేడా ఉందనీ స్పష్టమౌతుంది. హిందువుల పట్ల వారి విమర్శలు అజ్ఞానంతో కూడుకున్నవని వేరే చెప్పనక్కరలేదు.

భారతీయ జాతీయత గురించి స్పష్టమైన నిర్వచనం – ఈ జాతిది మతపరమైన ఏకత్వం కాదు, ఈ మట్టిని తల్లిగా భావించే భావోద్వేగం భారతీయతకు ఆధారం. భరతమాత పట్ల గౌరవాన్ని పంచుకునే ప్రతి వ్యక్తి–ఏ మతానికి చెందినవాడైనా–భారత జాతీయుడే.

ఈ విధంగా, భారతదేశ ఏకత్వం రాజకీయ సరిహద్దుల్లో కాదు, పూజా శాస్త్రాల్లో కాదు, ప్రజల హృదయం, సంస్కృతి, పరమాత్మ ధారణలో దృఢంగా వ్రేళ్లూనుకుంది.

## శ్రీ యంత్రోధారక హనుమాన్ ఆలయం

హనుమంతుని ఎన్నో రూపాలను మనం దర్శించుకుంటాము – పంచముఖ హనుమంతుడనీ, సప్త ముఖ హనుమంతుడనీ, బాల హనుమంతుడనీ, ధ్యానాంజనేయుడనీ ఇలా ఎన్నో రకాల రూపాలతో ఆంజనేయుని ఆలయాలు నిత్యం దర్శిస్తాం.

కానీ హనుమంతుడు తనకు తానుగా ఒక యంత్రానికి బద్ధుడై, యంత్ర స్వరూపంగా దర్శనమిచ్చే అరుదైన ఆలయం యంత్రోద్ధారక హనుమంతుని గుడి.

యంత్రోధారక హనుమాన్ ఆలయం, దీనినే ప్రాణదేవ ఆలయం అని కూడా పిలుస్తారు, ఇది హనుమంతుడికి అంకితం చేయబడింది, ఇది రామాయణ ఇతిహాసంలో కీర్తించబడింది.

హంపి పట్టణం పరిధిలో అంజనాద్రి పర్వతానికి ఆనుకుని ఉన్న మలయవన్ కొండలో ఈ ఆలయం ఉంది.

అంజనాద్రి హనుమంతుని జన్మస్థలం. సీతను రావణుడు పంచవటి అడవుల నుండి అపహరించిన సమయంలో, అప్పటి కిష్కిందకి దగ్గరగా ఉన్న మలయవాన్ కొండ వద్ద రాముడు హనుమంతుడిని కలిశాడని చెబుతారు.

రాముడిని హనుమంతుడు మొదటిసారిగా కలుసుకున్న జ్ఞాపకార్థం, అక్కడ కోదండరామ దేవాలయం అని పిలువబడే శ్రీరాముని ఆలయం ఉంది.

www.dakshinapatha.com www.csisindia.com

దక్షిణాపథ స్టడీస్ బులెటిన్

ఈ పత్రిక లో దక్షిణాపథ యొక్క ఆర్థిక సామాజిక సాంస్కృతిక రాజకీయ చరిత్ర పై మీ వ్యాసాలు ప్రచురించాలంటే సంప్రదించండి

For publishing your articles on Socio Cultural political and Economic history of Dakshinapatha please contact research@csisindia.com

Contact : +917075881925



యంత్రోధారక హనుమాన్ దేవాలయం అని పిలవబడే హనుమంతుని ప్రత్యేక దేవాలయం శ్రీరాముని ఆలయం వెనుకన ఉంది. ఈ రెండు దేవాలయాలు 14-15 శతాబ్దాలలో విజయనగర చక్రవర్తుల పాలనలో నిర్మించబడ్డాయి. యంత్రో ధారక హనుమాన్ ఆలయంలో పూజించబడే విగ్రహం, ఒక గ్రానైట్ బండరాయిపై చెక్కబడిన హనుమంతుని చిత్రం. ఈ యంత్రం యొక్క బయటి వృత్తంలో 12 కోతుల చుట్టూ ఉన్న ఒక ఆధ్యాత్మిక రేఖాచిత్రం ఉంటుంది. శ్రీచక్ర రూపంలో ఉన్న ఒక ఆధ్యాత్మిక రేఖాచిత్రంలో హనుమంతుని రూపు ఒక ప్రత్యేకమైన కూర్చున్న భంగిమలో ఉంది.

ఈ చిత్రం తుంగభద్ర నది ఒడ్డున ఒక నిర్దిష్ట ప్రదేశంలో ధ్యానం చేస్తున్నప్పుడు మధ్వాచార్యులు ప్రతిపాదించిన ద్వైత తత్వశాస్త్రానికి చెందిన మధ్వశాఖకు చెందిన సన్యాసి వ్యాసతీర్థ 12 సార్లు నిరంతరం చూసిన మానసిక చిత్రం నుండి రూపొందించబడింది అని చెపుతారు. వ్యాసరాజు లేదా వ్యాస తీర్థ (1447-1539) నిర్మించిన 732 హనుమాన్ విగ్రహాలలో ఇది మొదటిది అని కూడా చెబుతారు. వ్యాసరాజు విజయనగర రాజగురువు.

అతను భారతదేశమంతటా సంచరించి 732 హనుమంతుని ఆలయాలను ప్రతిష్టించాడు. వాటిలో మొదటిది తుంగభద్రా తీరాన హంపి దగ్గరగల చక్రతీర్థం లోని ఈ యంత్రోద్ధారక హనుమంతుని ఆలయం. అతను హనుమంతుని బొమ్మను ఒక బొగ్గుముక్కతో గీసి ఆ రూపాన్ని పూజించేవాడు. ఒక నిర్దిష్ట రోజున ధ్యానంలో ఉన్న సమయంలో అతను తన కళ్ల ముందు మెరుస్తున్న హనుమంతుని రూపాన్ని చూసే అవకాశం వచ్చింది. కలవరపడి, అతను తన దీక్ష స్థానాన్ని మార్చాడు, కానీ అక్కడ అతను హనుమంతుని రూపాన్ని చూడలేక పోయాడు. అతను మరెక్కడ కూర్చున్నా హనుమంతుని చిత్రం ఏదీ చూడలేకపోయాడు. అతను ఆ నిర్దిష్ట ప్రదేశంలో కూర్చున్నప్పుడే అతని మనసులో ఉన్న చిత్రాన్ని చూడగలిగాడు.

ఒకనాడు హంపీ క్షేత్రంలో తుంగభద్రా నదీ తీరాన చక్రతీర్థం లో ఒక బండరాయి పైన ఆంజనేయుని బొమ్మను యథావిధిగా బొగ్గుతో గీశాడు. పూజ చేస్తుండగా ఉన్నట్టుండి ఆ బొమ్మ నిజమైన కోతిలా మారి బండరాయినుండీ బైటికి దూకి వెళ్లిపోయింది. ఇలా పన్నెండు రోజులు జరిగింది. ఇక వ్యాసరాయరు అలసి పోయి ఈ పరీక్షనుండి కాపాడమని ఆంజనేయుడినే ప్రార్థించాడు.

రాయరు ప్రార్థనకు కరిగిన ఆంజనేయుడు తనంతట తానుగా ధ్యానంలో రాయరుకి ఆంజనేయ యంత్రాన్ని తెలిపి యంత్రానికి బద్ధుడై అందులో కూర్చున్నాడు.
అంతకుముందు బండరాయి నుండి తప్పించుకున్న 12 కోతులనూ యంత్రానికి చుట్టూతా ఉంచాడు. విగ్రహాన్ని నిశితంగా పరిశీలిస్తే, 12 కోతుల శిల్పాలు కనిపిస్తాయి, అవి ఒకదానికొకటి తోకను పట్టుకుని వెనుకకు ఉన్నాయి.

ఈ యాంత్రోద్ధారక హనుమ చిత్రపటం ఇంట్లో ప్రతిష్ఠించి, మహామహిమాన్వితమైన యాంత్రోద్ధారక హనుమత్ స్తోత్రం భక్తి శ్రద్ధలతో, సంపూర్ణ విశ్వాసంతో పూజిస్తే ఎంతటి కష్టాన్నైనా తొలగిస్తాడు అని భక్తుల విశ్వాసం. యంత్రోద్ధారక హనుమంతుని, యంత్రోధారక ఆలయం నుండి దాదాపు 5 నిమిషాల నడకలో శ్రీనివాస భగవానుడికి అంకితం చేయబడిన ఒక చిన్న ఆలయం ఉంది. ఈ విగ్రహం శ్రీ వ్యాసరాజుచే స్వయంగా చెక్కబడింది.

## అయోధ్యలో శ్రీరామ మందిరం - జాతి అస్తిత్వ పోరాటం (పుష్య ద్వాదశి రోజున అయోధ్యలో శ్రీరామలల్లా విగ్రహ ప్రాణప్రతిష్ట ద్వివార్షికోత్సవ వేడుకల సందర్భంగా)



దేశంలో ఒక ఆలయ నిర్మాణం కోసం పెద్దఎత్తున ప్రజలు ఉద్యమం జరపడం ఆశ్చర్యకరం. దేశంలోని పండితుల నుండి పామరుల వరకు శ్రీరాముడిని ఆదర్శంగా భావించారు, ఆయన పట్ల అచంచలమైన గౌరవాన్ని విశ్వాసాన్ని నింపుకున్న వీరు తమ ఆరాధ్య దైవం జన్మస్థానం కోసం తరతరాలుగా సంఘర్షణ చేయవలసి రావడం కూడా ఆశ్చర్యకరమే. ఈ పోరాటం 1528 నుండి 2019 వరకు కొనసాగింది. ప్రజలు జరిపిన సుదీర్ఘ పోరాటం ఈ దేశ ఆత్మగౌరవానికి ప్రజల యొక్క రాష్ట్రీయ లేదా జాతీయ భావానికి నాంది పలికింది.

ఇదే విషయాన్ని పఖ్యాతి చెందిన అమెరికన్ కౌన్సిల్ ఆఫ్ వేద మరియు జ్యోతిషశాస్త్ర విభాగానికి అధ్యక్షుడిగా పనిచేసిన 'శ్రీడేవిడ్ ఫ్రాలే' గారు ఇలా చెప్పారు. "అయోధ్య శ్రీరామజన్మభూమి ఉద్యమం కేవలం మందిరం కోసం మాత్రమే కాదు, ఈ ఆందోళన భారతదేశం యొక్క జాతీయ, సాంస్కృతిక వైభవ పునరుత్థానానికి ప్రారంభ సూచిక".

అయోధ్య ఆలయం కోసం 80 సార్లు యుద్ధాలు జరిగి నాలుగు లక్షల మంది ప్రజలు బలిదానమైన తర్వాత, స్వాతంత్ర్య భారతంలో ప్రజాస్వామ్యబద్ధంగా జరిగిన పోరాటంలో విజయం సాధించిన అనంతరం 2020 ఆగస్టు 5న అయోధ్యలో భూమిపూజ జరిగింది. ఇది కేవలం ఆలయ నిర్మాణానికి నాంది మాత్రమే కాదు, దేశ ప్రజల యొక్క జాతీయ భావజాలానికీ నాంది. మన దేశంలో శ్రీరాముడి ఆలయాలకు కొరత లేదు. ప్రతి ఊరిలోనూ ఉన్నాయి, కనుక కేవలం గుడికోసం పోరాటం అని చెబితే సరిపోదు. ఈ పోరాటం మతపరమైనదీ కాదు, ప్రాంతీయమైనది కాదు, ఏ ప్రత్యేక వర్గానిదీ కాదు, రాజకీయ పోరాటం అసలే కాదు. ఈ పోరాటం మన జాతి యొక్క స్పృహను మేల్కొల్పడానికి సంబంధించినది. ఇది మతపరమైనదైతే, ఈ ఉద్యమం ఉధృతంగా జరుగుతున్నప్పుడు, లక్షలాది కరసేవకులు అయోధ్యకు వెళుతుండగా, వారి మార్గంలో హైందవేతరుల ప్రార్థనా స్థలాలు అనేకం ఉన్నాయి. చాలా మంది వాటి ముందు నుండి వాటి మధ్య నుండి కూడా వెళ్ళారు, కానీ ఏ కరసేవకుడూ ఏ హైందవేతరుడికి లేదా అతని ప్రార్థనాస్థలికీ హాని కలిగించలేదు. అందుకే, ఈ ఉద్యమం ఎవరికీ వ్యతిరేకంగా జరిగిందికాదు.

అయోధ్య శ్రీరామజన్మభూమి ఉద్యమం మనదేశం మరియు హిందూ సమాజం యొక్క ఆత్మగౌరవం కోసం జరిగిన పోరాటం, హిందూ జాతికి జరిగిన అన్యాయాన్ని ప్రశ్నిస్తూ న్యాయం కోసం జరిగిన పోరాటం, విదేశీ ఆక్రమణకారుల చేతిలో విధ్వంసమైన ఈ దేశపు అస్తిత్వం కాపాడుకోవడం

కోసం చేసిన పోరాటం, ప్రాచీన కాలం నాటి పరంపరను ఆచారాలను జీవన విధానాన్ని పునః స్థాపించడం కోసం జరిగిన పోరాటం. దేశ ప్రజలు ఐక్యంగా నిలిచి చేసిన ఈ పోరాటాల వలన మన జాతికి, దేశానికి గొప్ప బలం సమకూరింది. ఈ బలమే దేశం యొక్క గౌరవాన్ని మరియు ప్రతిష్టనూ పెంచుతుంది కూడా.

ప్రజల భాగస్వామ్యం కోసం ప్రతి ఊరు నుండి ఒక ఇటుకను అయోధ్యకు పంపితే, ఈ దేవాలయం మనదనే భావన బలపడుతుంది, ఆలయం ఐకమత్యానికి చిహ్నంగా బాసిల్లుతుంది, పరాజయం పాలైన మనదేశం మరియు హిందూ సమాజం యొక్క విజయానికి చిహ్నంగా ఉంటుంది. ఈ భావనయే 495 సంవత్సరాలుగా శ్రీరామజన్మభూమి ఆందోళన నిర్వహించడానికి ప్రేరణనిచ్చింది. అప్పట్లో శ్రీరామశిల పూజల తర్వాత ఆందోళనకయ్యే ఖర్చులకు డబ్బులు తామే ఇవ్వాలని ఆందోళనకారులు నిర్ణయించి, కోటి కుటుంబాల నుండి ఇంటికి రూ. 1.25 ఇస్తే, యావత్ ప్రపంచం ఆశ్చర్యపోయింది. అప్పటినుండి శ్రీరామ కార్యానికి, ఆలయ నిర్మాణానికి భక్తులే ఆర్థిక సహాయం చేస్తున్నందున ఎప్పుడూ డబ్బుకు కొరత ఏర్పడలేదు. 2020 సం. లో దేశవ్యాప్తంగా ఐదు లక్షల 13 వేల పైచిలుకు గ్రామాలకు నుండి 14 కోట్ల కుటుంబాల వారు ఇచ్చిన సమర్పణలు 4 వేల కోట్ల రూపాయలకు పైనే సమకూరింది. ఆ ధనంతోనే ఈ ఆలయ నిర్మాణం జరిగినది.

ఈ ఆలయం కేవలం గొప్ప భవనంగా నిర్మించాలనే ఉద్దేశ్యంతో చేయడం లేదు, దేశ ప్రజలందరూ "ఇది నా ఆలయం, నా పూర్వీకులు గౌరవప్రదంగా రక్షించుకుంటూ వచ్చిన ప్రార్థనా స్థలం" అని ప్రతి సామాన్యుడు తనకు తానుగా భావించుకోవాలనే ఉద్దేశ్యంతోనే ఈ ఆందోళన నిర్వహించబడింది. ఈ కోణంలో "అయోధ్య శ్రీ రామ మందిరం నిర్మాణం ప్రత్యక్షంగా దేశ నిర్మాణమే."

అయోధ్య ఆలయంలో బాలరాముడి అందమైన విగ్రహం ఏర్పాటు చేయడం, అక్కడ హారతి, భజన జరగడం, ఇవి మాత్రమే కాదు, శ్రీరాముడి జీవితాదర్శాలను మన జీవితంలో కూడా ఆచరించాలి, ఆయన జీవితంలో స్వయంగా ఆచరించిన మార్గాన్ని మనం అనుసరించాలి, వివక్షతను పాటించకపోవడం రాక్షసశక్తులను అణిచివేయడం, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడం, సామాజిక విలువలకు, కుటుంబ నియమాలకు ప్రాధాన్యత నివ్వడం, ప్రజలకున్న నియమాలనే పాలకులు సైతం పాటించడం వంటి అనేక సద్గుణాలు ప్రస్తుత మన దేశ ప్రజలు పాటించే యత్నం అత్యావశ్యకం. ఈ ఆలయం 'లోక సంస్కారశాల'గా విలసిల్లుతుంది.

## వీరపాండ్య కట్టబొమ్మన్ (జన్మతిథి, జనవరి 03)

వీరపాండ్య కట్టబొమ్మన్ తమిళనాడులోని పంచాలంకురిచి (ప్రస్తుత తిరునల్వేలి)కి చెందినవాడు. అతని తండ్రి ఆది కట్టబొమ్మన్ జగవీర పాండియన్ ఆస్థానంలో మంత్రిగా ఉన్నారు.

వీరపాండ్య కట్టబొమ్మన్ జనవరి 3, 1760న ఆది కట్టబొమ్మన్ మరియు ఆరుముగతమ్మళ్ దంపతులకు జన్మించాడు. 30 సంవత్సరాల వయస్సులో పంచలన్‌కురిచ్చికి 47వ రాజు అయ్యాడు. బ్రిటిష్ ఈస్ట్ ఇండియన్ కంపెనీని ప్రతిఘటించిన దక్షిణ భారతదేశంలోని రాజులలో ఇతను ఒకడు. బ్రిటిష్




వారికి మొదట్లో పన్ను ఎగవేసాడు. కలెక్టర్ జాక్సన్‌ను కలవమని పదేపదే సమన్లు జారీ చేయడాన్ని అతను తిరస్కరించాడు. తరువాత జాక్సన్‌తో అతని సమావేశం భౌతిక పోరాటంగా ముగిసి, కంపెనీ దళాల డిప్యూటీ కమాండెంట్ క్లార్క్ చంపబడ్డాడు. దీని ఫలితంగా మేజర్ బ్యానర్‌మాన్ నాయకత్వంలో బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ కట్టబొమ్మన్‌ను పట్టుకోవడానికి సైన్యాన్ని పంపింది. పంచలన్‌కురిచ్చి నుండి కొన్ని మైళ్ల దూరంలో ఉన్న సాలికులం వద్ద ఉన్న కట్టబొమ్మన్ కోటను చుట్టుముట్టిన కంపెనీ సైన్యం అతన్ని అక్కడ అరెస్టు చేయాలని భావించింది. కడు నేర్పరి అయిన వీరపాండ్య కట్టబొమ్మన్, కంపనీ సైన్యాన్ని మట్టి కరిపించి తాను కోట నుండి తప్పించుకున్నాడు. తూర్పు ఇండియా కంపెనీ అతని తలకు ధర నిర్ణయించింది.

తదనంతర పరిణామాల్లో ఎట్టప్పన్ అనే అనుంగు అనుచరుడు వీరపాండ్య కట్టబొమ్మన్ ని మోసం చేశాడు. దీని ఫలితంగా అతను అరెస్టు చేయబడి ఉరితీయబడ్డాడు. 1799 లో అతన్ని చింతచెట్టుకు వేలాడదీశారు. ఆ తరువాత బ్రిటిష్ వారు అతని కోటను పూర్తిగా కూల్చివేసి అతని సంపదను దోచుకున్నారు.

తమిళనాడు ప్రభుత్వం ఆయన జ్ఞాపకార్థం పంచలన్‌కురిచిలో ఒక స్మారక కోటను నిర్మించి సత్కరించింది. 1857లో మంగళ్ పాండే ప్రారంభించిన మొదటి భారత స్వాతంత్ర్య యుద్ధానికి చాలా కాలం ముందు బ్రిటిష్ వారిని ఎదిరించిన ధైర్యవంతుడైన తమిళ వీరుడిగా ఆయన పేరు ప్రజలలో గుర్తుండిపోతుంది.

## యల్లాప్రగడ సుబ్బారావు (జన్మతిథి, జనవరి 12 )



ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో 1895 జనవరి 12న జన్మించారు ఎల్లాప్రగడ సుబ్బారావు. ఆయనకు 18 ఏళ్ల వయసు ఉన్నప్పుడే తండ్రి చనిపోయారు. సోదరులిద్దరికీ అనారోగ్యమే. ఇబ్బందుల కారణంగా రెండుసార్లు మెట్రిక్యులేషన్ తప్పారు. అన్నయ్య పురుషోత్తం వద్ద ఉండి రాజమండ్రిలో చదువుకునే సమయంలో.. సుబ్బారావును జాతీయోద్యమం ఆకర్షించింది. తల్లి వెంకమ్మ నగలు అమ్మగా వచ్చిన సొమ్ము, స్నేహితుల సాయంతో.. మద్రాసు వెళ్లి హిందూ హైస్కూల్‌లో చదివిన సుబ్బారావు.. మూడో దఫాలో మెట్రిక్యులేషన్ పాసయ్యారు. ఇంటర్ లో గణితంలో డిస్టింక్షన్ సాధించారు. ఆ సబ్జెక్ట్‌లోనే ఆనర్స్ చేయాలని అంతా ఒత్తిడి తెచ్చారు. సుబ్బారావు మాత్రం రామకృష్ణ మఠంలో సన్యాసిగా మారాలనుకున్నారు. తల్లి, మఠం నిర్వాహకులు నచ్చజెప్పి ఆయనను వైద్య విద్య వైపు మళ్లించారు. అలా మద్రాస్ మెడికల్ కాలేజీలో చేరారు. ఆర్థిక ఇబ్బందులతో చదువు ఆగిపోయే పరిస్థితి తలెత్తడంతో అప్పు కోసం ప్రయత్నించారు. ఈ దశలో 'నిన్ను మేమే చదివిస్తాం. మా అమ్మాయిని పెళ్లి

చేసుకో' అని కస్తూరి సూర్యనారాయణ కోరగా.. ఆయన కుమార్తె శేషగిరిని పెళ్లి చేసుకున్నారు.

అది సహాయ నిరాకరణ ఉద్యమం సాగుతున్న వేళ! గాంధీజీ పిలుపుతో విదేశీ వస్త్ర బహిష్కరణలో పాల్గొన్నారు సుబ్బారావు. ఇందులో భాగంగా ఖద్దరుకు కట్టుబడ్డారు. ఖద్దరుతో తయారైన సర్జికల్ ఆప్రాన్ ధరించి సుబ్బారావు మెడికల్ కాలేజీకి వెళ్లారు. అక్కడి సర్జరీ విభాగం ఆచార్యుడు ఎం.సి.బ్రాడ్‌ఫీల్డ్‌కు ఇది ఆగ్రహం కల్గించింది. 'గాంధీ వైస్రాయ్ అయ్యాక దీన్ని ధరించు' అంటూ ఎద్దేవా చేశాడు. సుబ్బారావు వెంటనే ఏమాత్రం జంకకుండా.. 'వైస్రాయ్ స్థాయికి గాంధీజీ ఎన్నడూ దిగజారడు' అని ఘాటుగా బదులిచ్చారు. దీంతో బ్రాడ్‌ఫీల్డ్.. సుబ్బారావుపై కక్షగట్టాడు. ఆయనకు డాక్టర్ పట్టా ఇవ్వకుండా అంతకన్నా తక్కువదైన ఎల్ఎంఎస్ సర్టిఫికెట్‌తో సరిపుచ్చారు. బ్రాడ్‌ఫీల్డ్ పుణ్యామా అని వైద్య వృత్తి పట్టా దక్కని సుబ్బారావు ఆయుర్వేదంపై దృష్టిసారించారు. దీనికి కారణం లేకపోలేదు. అంతకుముందు 'ఉష్ణమండల స్ప్రూ' వ్యాధి బారినపడ్డ తనను లక్ష్మీపతి అనే ఆయుర్వేద వైద్యుడు కాపాడారు. దీంతో మద్రాస్‌లో ఆ డాక్టర్‌కు చెందిన ఆయుర్వేద కళాశాలలో అనాటమీ లెక్చరర్‌గా చేరి ఆ రంగంలో పరిశోధనలూ సాగించారు. భారత్‌కు వచ్చిన అమెరికన్ వైద్యుడు జాన్ ఫాక్స్ కెండ్రిక్స్... సుబ్బారావులోని మేధస్సును గుర్తించారు. విదేశాలకు వెళ్లి పరిశోధనలు చేయాలని సూచించారు. అప్పట్లో పరిశోధనల కోసం ఎక్కువగా ఇంగ్లండ్‌కు వెళ్లేవారు. కానీ బ్రిటన్ అంటే విముఖతతో ఎల్లాప్రగడ అమెరికాలోని హార్వర్డ్ స్కూల్ ఆఫ్ ట్రాపికల్ మెడిసిన్‌లో అడ్మిషన్‌కు దరఖాస్తు చేశారు. మెడిసిన్ డిప్లొమా కోర్సులో కెమిస్టుగా ప్రవేశం లభించింది. 1923 అక్టోబరులో సుబ్బారావు అమెరికాలో కాలుమోపారు. హార్వర్డ్‌లోనే పరిశోధనలపై దృష్టిసారించారు. పీహెచ్‌డీ సాధించారు. ఔషధ రంగంలో అద్భుత ఆవిష్కరణలు చేశారు.

- రెండో ప్రపంచయుద్ధ సమయంలో ఆయన చేసిన పరిశోధన తొలి టెట్రాసైక్లిన్ యాంటీ బయాటిక్- అరియోమైసిన్ ఆవిష్కారానికి దారితీసింది. ఫైలేరియా గురించి పరిశోధన చేసి, హెట్రజన్ ఔషధాన్ని సుబ్బారావు కనిపెట్టారు.

- క్షయ కట్టడికి ఐసోనికోటినిక్ ఆసిడ్ హైడ్రాజైడ్‌ను రూపొందించారు. క్యాన్సర్‌కు వాడే కీమోథెరపీ ఔషధాల్లో తొలితరం డ్రగ్ మెథోట్రెక్సేట్‌ను సిడ్నీ ఫార్బర్ అనే శాస్త్రవేత్తతో కలిసి అభివృద్ధి చేశారు.

ఇన్ని అద్భుత ఆవిష్కరణలు చేసినప్పటికీ డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావుకు నోబెల్ బహుమతి దక్కలేదు. ఆయన కనిపెట్టిన అంశాలపై ముందుకెళ్లి పరిశోధనలు చేసిన శిష్యులకు ఆ పురస్కారాలు లభించడం గమనార్హం. 1948 ఆగస్టు 9న 53 ఏళ్ల వయసులో గుండెపోటుతో ఎల్లాప్రగడ సుబ్బారావు అమెరికాలోనే కన్నుమూశారు.

అమెరికా రచయిత డోరోన్ ఆంట్రిమ్ మాటల్లో చెప్పాలంటే.. "బహుశా ఈ తరంలో చాలామంది ఎన్నడూ డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు పేరు విని ఉండకపోవచ్చు. కానీ ఒకప్పుడు ఆయన జీవించి ఉండటం వల్లే నేడు మనమంతా ఆరోగ్యంగా, సజీవంగా ఉంటున్నాం. ఆయన కృషే మానవాళి దీర్ఘాయుష్షుకు బాటలు పరిచింది".

## వసంత పంచమి (జనవరి 23)



విద్య, విజ్ఞానం, వివేకం వల్లనే ఏ రంగంలోనైనా రాణించడం జరుగుతుంటుంది. ఈ మూడూ మనిషికి తేజస్సును ల యశస్సును తీసుకు వస్తాయి. విద్యార్థినీ విద్యార్థులకు ఇవి సహజ అలంకారాలుగా మారాలంటే, అందుకు సరస్వతీ దేవి అనుగ్రహం వుండాలి. ఆ అనుగ్రహమే దక్కాలంటే ఆమెను భక్తి శ్రద్ధలతో పూజించాలి. భక్తులకు ఆ అవకాశాన్ని కలిగించేదే 'శ్రీ పంచమి' లేదా వసంత పంచమి పర్వదినం.

చైత్ర మాసంలో ఆరంభమయ్యే వసంతరుతువు, మాఘమాసంలోనే అందుకు కావలసిన రూపురేఖలను సంతరించుకుంటుంది. ఆ విషయాన్ని సూచిస్తూ 'వసంతపంచమి' జరుపుకోవడం జరుగుతుంది. సరస్వతీ దేవి జయంతి ఈ రోజే కావడం వలన దీనిని 'శ్రీ పంచమి' అని అంటారు. ఈ రోజున ఆమెను ఆరాధించాలని శాస్త్రాలు చెబుతున్నాయి. సరస్వతీ దేవి అభివృద్ధికి ఆధారమైన విద్యను ప్రసాదిస్తుంది. పాలనుంచి నీటిని హంస వేరుచేస్తుందని అంటారు. అలా అజ్ఞానం నుంచి జ్ఞానం వేరు చేయబడుతుందనడానికి సూచనగా ఆమె హంసను వాహనంగా చేసుకుని కనిపిస్తుంది.

అందువలన ఆమె ఆవిర్భవించిన ఈ రోజున ఉదయాన్నే నిద్రలేచి తలస్నానం చేసి కొత్తబట్టలు ధరించాలి. పూజామందిరాన్ని శుభ్రపరిచి సరస్వతి అమ్మవారిని పూజించాలి. అమ్మవారికి ఇష్టమైన పాలు, పెరుగు, వెన్న ల పాయసం నైవేద్యంగా సమర్పించాలి. జ్ఞానాన్ని ప్రసాదించమని మనస్ఫూర్తిగా వేడుకోవాలి. ఇక ఈ రోజున వివిధ ప్రాంతాల్లోని సరస్వతీ ఆలయాలను భక్తులు విశేష సంఖ్యలో దర్శిస్తుంటారు. అమ్మవారికి తెలుపురంగు అంటే ఇష్టం కనుక ఆమెకి తెల్లని పువ్వులు, అంచుతో కూడిన తెల్లని వస్త్రాలు సమర్పిస్తుంటారు.

తమ పిల్లలకు అక్షరాభ్యాసం జరిపించడం కోసం తల్లిదండ్రులు ఈ రోజు కోసమే ఎదురు చూస్తుంటారు. ఈ కారణంగా ప్రతి సరస్వతి ఆలయంలోను ఈ రోజున అక్షరాభ్యాసాలు పెద్ద సంఖ్యలో జరుగుతుంటాయి. ఇక విద్యార్థినీ విద్యార్థులు తమ పుస్తకాలను ల పెన్నులను అమ్మవారి పాదాలచెంత వుంచి పూజ చేయిస్తారు. ఈ రోజున అమ్మవారి కంకణాలను ధరించడం ఎంతో శుభప్రదంగా భావిస్తుంటారు. ఇక ఈ రోజున వసంతుడితో పాటు రతీ మన్మథులను కూడా పూజిస్తూ వుంటారు గనుక, దీనిని 'మదనపంచమి' అని కూడా వ్యవహరిస్తుంటారు.

## మన్యంకొండ జాతర (మాఘ మాసంలో )

తెలంగాణ రాష్ట్రంలో, ఘన చరిత్ర కలిగిన అనేక ఆధ్యాత్మిక దేవాలయాలు ఉన్నాయి. వాటిలో ఒకటి పాలమూర్ జిల్లాలోని మన్యంకొండ గ్రామంలోని మన్యంకొండ వెంకటేశ్వర ఆలయం.

చాలా అరుదుగా మనం వెంకటేశ్వరుడిని "స్వయంభూమూర్తి"గా చూస్తుంటాము. దట్టమైన అడవిలో, పచ్చదనంతో నిండిన వెంకటేశ్వరుడి ఆలయాన్ని చూడటం నిజంగా ఆనందకరమైన అనుభవం.

మన్యంకొండ లేదా మన్నెంకొండ (లేదా మణికొండ) అనేది వెంకటేశ్వర స్వామి ఆలయం ఉన్న కొండ. ఈ ప్రదేశం చాలా ప్రశాంతంగా, భక్తులను మంత్రముగ్ధులను చేస్తూ ఉంటుంది. ఈ పురాతన ఆలయం ఐదు వందల



నంవత్సరాల కంటే పాతదని నమ్ముతారు.

గతంలో, నరసింహ యోగి, కాశిరాయలు, ఎట్టేపు రామయోగి, వీరప్పయ్య, యనుమద్దాసు వంటి పురాతన సాధువులు ఇక్కడ ధ్యానం చేశారని, అందుకే ఈ ప్రదేశాన్ని మునులకొండ అని పిలిచారని, తరువాత రోజులు గడిచేకొద్దీ దీనిని మన్నెంకొండ లేదా మన్యంకొండగా సుప్రసిద్ధం చేశారని ఆలయ శాసనం చెబుతుంది.

అందమైన ప్రకృతి దృశ్యాలు మరియు పురాతన ప్రాముఖ్యతతో చుట్టుముట్టబడిన కొండపై ఉండటం వల్ల, ఈ ప్రదేశం పాలమూర్ జిల్లా మరియు తెలంగాణ రాష్ట్రంలో ప్రధాన పర్యాటక ఆకర్షణగా చాలా ప్రాముఖ్యతను సంతరించుకుంది.

మన్యంకొండ వెంకటేశ్వర దేవాలయం మహబూబ్‌నగర్ పట్టణం నుండి రాష్ట్ర రహదారిపై రాయచూర్ వెళ్ళే మార్గంలో 13 కిలోమీటర్ల దూరంలో ఉళిది.

అడవి మధ్యలో మరియు కొండపైన, వెంకటేశ్వర స్వామి గంభీరంగా కనిపిస్తాడు. ఈ మందిరం 915 మీటర్ల ఎత్తులో మరియు మన్యంకొండ గ్రామం నుండి 2 కి.మీ దూరంలో ఉన్న ఒక కొండపై ఉంది.

ఈ ఆలయం మూడు కొండల పైన ఉన్న ఒక గుహలో ఉంది. ఇక్కడ ప్రధాన దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి మరియు ఈ ప్రదేశాన్ని హరిహర క్షేత్రం అని కూడా పిలుస్తారు.

ఆలయం చుట్టూ తిరిగేటప్పుడు, వెనుక గోడకు ఎదురుగా వెంకటేశ్వర స్వామి తిరుపతి విగ్రహాన్ని పోలి 'స్వయంగా వ్యక్తమయ్యాడని' భక్తులు నమ్ముతారు. పురాతన కాలంలో సాధువులు ఇక్కడి గుహలలో తపస్సు చేశారని ప్రతీతి.

ప్రతి సంవత్సరం జనవరి మరియు ఫిబ్రవరి నెలల్లో జరుపుకునే 'జాతర' సమయంలో ఆలయాన్ని సందర్శించడం అనువైనది. సాధారణంగా ఈ పండుగ 'మహాపూర్ణిమ' రోజున జరుగుతుంది. ఈ ప్రదేశాన్ని 'పాలమూర్ తిరుపతి' అని కూడా పిలుస్తారు.

## భారతీయ ఏకాత్మతకు వారధి -- అగస్త్య మహర్షి

భారతీయ సంస్కృతి అనగా విభిన్నతలలో ఏకత్వానికి ప్రతీక. భాషలు, ఆచారాలు, సంప్రదాయాలు, వేషధారణలు భిన్నమైనప్పటికీ ఒకే ఆధ్యాత్మిక మూలాన్ని కలిగి ఉండటం భారతదేశ విశిష్టత. ఈ ఉత్తర--దక్షిణ భారతాల మధ్య సాంస్కృతిక, ఆధ్యాత్మిక, భాషాపరమైన వారధిని నిర్మించిన మహానుభావులలో అగ్రగణ్యుడు అగస్త్య మహర్షి. అందుకే ఆయన్ను "ఉత్తర–దక్షిణ భారతాలకు వారధి"గా భారతీయ సంప్రదాయం కీర్తిస్తుంది.

అగస్త్యుడు సప్తర్షులలో ఒకడు. ఋగ్వేద, యజుర్వేద సంప్రదాయాలలో ఆయనకు విశిష్ట స్థానం ఉంది. తపస్సు, జ్ఞానం, శాస్త్ర పరిజ్ఞానం, భాషా వికాసం, ధర్మ పరిరక్షణ – ఇలా అన్ని రంగాలలో ఆయన సేవలు అమోఘం. పురాణాలు, ఇతిహాసాలు, వేదాలు, ఆగమాలు అగస్త్య మహర్షిని అత్యంత మహనీయుడిగా కీర్తిస్తాయి.



ఉత్తర భారతంలో అగస్త్య మహర్షి వేద సంస్కృతికి ప్రధాన స్తంభంగా నిలిచాడు.

- ఋగ్వేదంలోని అనేక సూక్తాలు అగస్త్య మహర్షికి ఆపాదించబడ్డాయి
- వైదిక యజ్ఞాలు, బ్రాహ్మణ సంప్రదాయాల విస్తరణలో ఆయన పాత్ర కీలకం
- సంస్కృత భాషాభివృద్ధికి ఆయన చేసిన సేవలు అపారం

ఉత్తర భారతదేశంలో ఏర్పడిన ఆధ్యాత్మిక జ్ఞానాన్ని కేవలం అక్కడికే పరిమితం చేయకుండా, దక్షిణ భారతానికి తీసుకెళ్లాలనే దృష్టి అగస్త్యుడికి ఉండేది.

పురాణ కథనం ప్రకారం, దేవతలందరూ ఉత్తర దిక్కులో సమీకృతమై భూభారం పెరిగినప్పుడు, దక్షిణాన్ని సమతుల్యం చేయడానికి అగస్త్య మహర్షిని దక్షిణానికి పంపారు. ఇది కేవలం పురాణ కథ కాకుండా, సాంస్కృతిక వలస మరియు జ్ఞాన వ్యాప్తికి ప్రతీకగా భావించాలి.

అగస్త్య మహర్షి వింధ్య పర్వతాన్ని నమ్రం చేసి దాటడం అనేది:

- ఉత్తర–దక్షిణ విభజనలను తొలగించడం
- భౌగోళిక అడ్డంకులను జ్ఞానంతో అధిగమించడం
- సాంస్కృతిక సమన్వయానికి మార్గం సృష్టించడం అనే భావనలకు ప్రతీక.

**దక్షిణ భారతదేశంలో అగస్త్య మహర్షి ప్రభావం అత్యంత లోతైనది. వారి అద్భుత తపః సంపత్తి ద్వారా వారు సాధించిన విజయాలలో మచ్చుకు కొన్ని:**

- తమిళ భాషా వ్యాకరణానికి అగస్త్యునికి సంబంధం ఉందని తమిళ సంప్రదాయం చెబుతోంది.
- "అగస్త్యముని వ్యాకరణం" అనే గ్రంథ ప్రస్తావన తమిళ సాహిత్యములో కనిపిస్తుంది
- సంస్కృతం మరియు తమిళం మధ్య సాహిత్య వారధిగా అగస్త్యుడు నిలిచాడు
- శైవ సిద్ధాంతం, యోగ, తంత్ర సంప్రదాయాల వ్యాప్తి
- శివభక్తి, శక్తి ఆరాధనల సమన్వయం
- సిద్ధ వైద్య సంప్రదాయానికి మూల పురుషుడిగా గుర్తింపు
- ధర్మం, ఆచారం, ఆశ్రమ వ్యవస్థలను దక్షిణంలో స్థాపించడం
- వేదాచారాలను స్థానిక సంప్రదాయాలతో సమన్వయం చేయడం

అగస్త్య మహర్షి గొప్పతనం ఆయన ఒక సంస్కృతిని మరొక సంస్కృతిపై రుద్దలేదు. బదులుగా ఉత్తర భారత వేద సంప్రదాయాలను దక్షిణ భారత స్థానిక భాషలు, ఆచారాలతో సమన్వయం చేసి ఒక సమగ్ర భారతీయ సంస్కృతిని నిర్మించాడు.

శ్రీరాముడు దక్షిణయాత్రలో అగస్త్య మహర్షిని దర్శిస్తాడు. రాముడికి దివ్యాస్త్రాలు, ఆదిత్య హృదయం ఉపదేశించిన మహర్షి అగస్త్యుడు. ఇది ఉత్తర భారతీయ రాజవంశం మరియు దక్షిణ భారత ఆధ్యాత్మిక కేంద్రాల మధ్య అనుబంధానికి నిదర్శనం.

నేటి భారతదేశంలో ప్రాంతీయ విభేదాలు, భాషా భేదాలు, సాంస్కృతిక భిన్నతలు కనిపిస్తున్న వేళ, అగస్త్య మహర్షి జీవితం సమన్వయం, పరస్పర గౌరవం, సాంస్కృతిక ఐక్యత అనే విలువలను బోధిస్తుంది.

అగస్త్య మహర్షి కేవలం ఒక ఋషి మాత్రమే కాదు – అయన ఒక సాంస్కృతిక వారధి, ఒక ఆధ్యాత్మిక దూత, భారతీయ ఏకత్వ శిల్పి.

ఉత్తర భారతదేశపు వేద జ్ఞానాన్ని దక్షిణ భారతదేశపు భాషా, సంస్కృతులతో అనుసంధానం చేసి, భారతదేశాన్ని ఒక అఖండ సాంస్కృతిక శక్తిగా ప్రదిద్దిన మహానుభావుడు అగస్త్య మహర్షి. అందుకే ఆయనను "ఉత్తర–దక్షిణ భారతాలకు వారధి" అని ఘనంగా కొనియాడటం సంపూర్ణంగా సముచితమైనది.

**ఈ నెలలో ముఖ్యమైన రోజులు:**

1. స్వామి వివేకానంద జయంతి, జనవరి 12
2. మకర సంక్రాంతి, జనవరి 15
3. నేతాజీ సుభాష్ చంద్ర బోస్ జయంతి, జనవరి 23
4. రథ సప్తమి, జనవరి 25
5. భారత గణతంత్ర దినోత్సవం, జనవరి 26

ఈ పత్రిక లో దక్షిణాపథ యొక్క ఆర్థిక సామాజిక సాంస్కృతిక రాజకీయ చరిత్ర పై మీ వ్యాసాలు ప్రచురించాలంటే సంప్రదించండి
research@csisindia.com

For publishing your articles on Socio Cultural political and Economic history of Dakshinapatha please contact
research@csisindia.com
Contact : +917075881925

